




రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సా : 6.34గం..
సహర్ : మంగళవారం ఉ : 4.54 గం..

ఆదివారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 37.0°C | కనిష్ఠం : 24.0°C

కారు స్టీరింగ్ ఖాళీ

- వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్ష పగ్గాలు ఎవరికి దక్కేనో?
- అరూరి రమేష్ రాజీనామాతో ఏర్పడ్డ ఖాళీ
- కొత్త అధ్యక్షుడి కోసం అధిష్ఠానం అన్వేషణ
- పెద్ది సుదర్శన్‌రెడ్డి వైపే బీఆర్ఎస్ నేతలు చూపు
- పరిశీలనలో నన్నపునేని, చల్లా, పెద్ది స్వప్న పేర్లు..
- పార్టీని బలోపేతం, వలసలను నిలువరించే నేతకే పగ్గాలు
- కొత్త అధ్యక్షుడిపైనే రెండు లోక్‌సభ అభ్యర్థుల గెలుపు బాధ్యతలు

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి ఖాళీ ఏర్పడింది. వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కొనసాగిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్. ఈనెల 17న పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో పార్టీ పగ్గాలు ఎవరి చేతిలో లేక గులాబీ కారు మూలకు పడింది. అయితే మే 13న లోక్‌సభ ఎన్నికలు ఉండటంతోపాటు వరంగల్, మహబూబాబాద్ అభ్యర్థులుగా కడియం కావ్య, సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలకు టికెట్ ఇచ్చారు. ఈ క్రమంలో అత్యవసరంగా వరంగల్ జిల్లా బీఆర్ఎస్‌కు అధ్యక్షుడిని నియమించాలని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. దీంతో సరైన నేత కోసం అధిష్ఠానం పలువురి పేర్లు పరిశీలిస్తోంది.





కారు స్టీరింగ్ ఎవరికో?!

(వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వరంగల్ గులాబీ కారు స్టీరింగ్ ఎవరికి చేతికి ఇవ్వాలో బీఆర్ఎస్ అధిష్ఠానం అన్వేషిస్తోంది. వరంగల్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ఇటీవల బీజేపీలో చేరారు. దీంతో వరంగల్ గులాబీ కారు ముందుకు నడిపే నాయకుడి కోసం అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఇప్పటికే ఒక్కొక్కరు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్న క్రమంలో.. జిల్లా అధ్యక్ష పదవిని పార్టీని బలోపేతం చేస్తూ వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిని గెలిపించే సత్తా ఉన్న నాయకుడికి అప్పగించాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లుగా సమాచారం. దీంతో పలువురు మాజీ ఎమ్మెల్యేలతో పాటు పార్టీలో కీలకంగా వ్యవహరించిన నేతల పేర్లను పరిశీలిస్తోంది. అయితే గులాబీ పార్టీ పగ్గాలు ఎవరికి దక్కుతాయో అనే ఉత్కంఠ వరంగల్ బీఆర్ఎస్ శ్రేణుల్లో నెలకొంది.

పలువురి పేర్లు పరిశీలన

బీఆర్ఎస్‌కు వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి వైపు పార్టీ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లుగా సమాచారం. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాకు బీఆర్ఎస్ అధ్యక్షుడిగా 12ఏళ్లకు పైగా పెద్ది సుదర్శన్‌రెడ్డి పని చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని గ్రామాలు, పట్టణాల్లో పెద్దికి పరిచయాలున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాకు అధ్యక్షుడిగా పని చేసిన సురదర్శన్‌రెడ్డి.. చిన్న జిల్లాకు అధ్యక్ష బాధ్యతలు తీసుకుంటారా? అనే చర్చ పార్టీలో జరుగుతోంది. అయితే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, వరంగల్ జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న పెద్ది స్వప్నకు పార్టీ జిల్లా పగ్గాలు ఇచ్చి, సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా పార్టీలో నడుస్తోంది. భార్యాభర్తలకు జోడు పదవులపై పార్టీలో అభ్యంతరాలు వస్తే.. ప్రత్యామ్నాయంగా మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డిల పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. అయితే పరకాల నియోజకవర్గంలో కొన్ని మండలాలు హనుమకొండ జిల్లాలో, మరికొన్ని మండలాలు వరంగల్ జిల్లాలో ఉన్నాయి. ఈ కోణంలో ఏమైనా అభ్యంతరాలు వస్తాయా? అనే చర్చ కూడా పార్టీలో జరుగుతోంది.

అలాగే వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు పార్టీ పగ్గాలు ఇస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా బీఆర్ఎస్‌లో సాగుతోంది. జిల్లా కేంద్రంలో ఉండే అవకాశం ఉన్న నరేందర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించే విషయంలోనూ ఆలోచనలు చేస్తున్నట్లుగా సమాచారం. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేరును కూడా పార్టీ పరిశీలించింది. అయితే ఆయన స్థాయికి ఇది చిన్న పదవి అవుతుందేమో అనే ఆలోచనలో పార్టీ ఉంది. వీరితో పాటు మరో నలుగురైదుగురు ఉద్యమకారులు, సీనియర్ల పేర్లను బీఆర్ఎస్ నేతలు పరిశీలిస్తున్నారు. అయితే మెజారిటీ నేతలు ప్రస్తుతం పార్టీ ఉన్న క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు మోయటం సులభం కాదని, గతానుభవం దృష్ట్యా పెద్ది సుదర్శన్‌రెడ్డికి పదవి ఇస్తేనే బాగుంటుందని సీనియర్లు సూచిస్తున్నట్లుగా సమాచారం.

లోక్‌సభ ఎన్నికల భారం

మే 13న లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య, మహబూబాబాద్ అభ్యర్థిగా మాలోతు కవిత పేరును అధిష్ఠానం ప్రకటించింది. అయితే బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక అనేకమంది కీలక నేతలు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీల్లో చేరుతున్నారు. వరంగల్ జిల్లాలో కీలకమైన నేతలు అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బీఆర్ ఎస్‌ను వీడారు. మరికొంత మంది నేతలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వరంగల్ మేయర్ గుండు సుధారాణి కూడా పార్టీని వీడుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీని బలోపే తం చేస్తూ పార్టీ నుంచి వలసను నిలువరించాల్సిన బాధ్యత కూడా కొత్త అధ్యక్షుడిపైనే ఉంటుందని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా వరంగల్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటే వరంగల్ జిల్లాలోనే వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలతోపాటు పరకాల, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలు, డివిజన్‌లు ఉన్నాయి.

మహబూబాద్ లోక్‌సభ పరిధిలో వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గం ఉంది. దీంతో వరంగల్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ ఎన్నికలను భుజస్కంధాలపై వేసుకుని నడిపించే బాధ్యత కూడా వరంగల్ జిల్లా అధ్యక్షుడిపైనే ఉంటుంది. పార్టీ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమర్థవంతమైన నాయకుడికి వరంగల్ జిల్లా పగ్గాలు ఇవ్వాలనే ఆలోచనలో పార్టీ ఉన్నట్లుగా సమాచారం. ఈ నెలఖారులోగా, లేదంటే ఏప్రిల్ మొదటి వారంలో పార్టీ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అధ్యక్షుడు కూడా లేని వరంగల్ కారు పార్టీని గాడిలో పెట్టేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం దృష్టి పెట్టడం గులాబీ క్యాడర్‌లో చర్చనీయాంశంగా మారింది.

అరూరికే ఖరారు

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా అరూరి రమేష్
ప్రకటించిన పార్టీ అధిష్ఠానం
ఎట్టకేలకు ఉత్కంఠకు తెర



హనుమకొండటౌన్, మార్చి 24: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిత్వంపైనెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఇటీవలే బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పేరును అధిష్ఠానం ప్రకటించింది. టికెట్ కోసం ఆరడజను మందికి పైగా ఆశావహులు ప్రయత్నాలు చేశారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పరకాల మునిసిపల్ చైర్మన్ రాజభద్రయ్య, సీనియర్ నేతలు చింత సాంబమూర్తి, మాజీ మంత్రి గుండె విజయరామారావులతోపాటు మాజీ డీఐజీ టి.కృష్ణప్రసాద్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు అరూరికే కమలనాథులు మొగ్గుచూశారు. కాగా, వరంగల్ ఎంపీ సీటుకు బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థులను ఖరారు చేయగా, కాంగ్రెస్ అభ్యర్థి తేలలేదు.

వరంగల్ లోక్‌సభ సీటుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. బీజేపీకి మద్దతు ఇస్తున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌తో బీజేపీ పెద్దలు సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో బీజేపీలో చేరేందుకు అరూరి సముఖత వ్యక్తం చేశారు. అయితే బీజేపీలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. ఒకదశలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసేందుకు రమేష్ ప్రెస్‌మీట్ పెడితే... అదే రోజు బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, బస్వరాజు సారయ్య, నాగుర్ల వెంకన్న తదితరులు రమేష్‌ను బలవంతంగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి కేసీఆర్‌తో సమావేశం నిర్వహించారు. వరంగల్ ఎంపీ టికెట్ రమేష్‌కు ఇచ్చేందుకు కేసీఆర్ అంగీకరించినా పోటీకి అరూరి సుముఖత వ్యక్తం చేయలేదు. దీంతో వెంటనే కడియం కావ్య పేరును అధిష్ఠానం ప్రకటించింది. పార్టీ మారటంపై అరూరి కొంత తర్జన భర్జనల తరువాత బీజేపీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఈనెల 17న కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం జిల్లాలో బీజేపీ ముఖ్యులను కలుస్తూ తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వచ్చారు. అనుకున్నట్లుగానే ఆదివారం ఐదో జాబితాలో అరూరి రమేష్ పేరును అధిష్ఠానం ఖరారు చేయటంతో బీజేపీలో సంబరాలు వ్యక్తం అవుతున్నాయి. కాంట్రాక్టర్‌గా ఉన్న అరూరి రమేష్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర

మిగతా 8వ పేజీలో...

అరూరి బయోడేటా

పేరు:	అరూరి రమేశ్
తల్లిదండ్రులు:	గట్టుమల్లు, వెంకటమ్మ
భార్య :	కవితకుమారి
సంతానం:	కుమారుడు విశాల్, కుమార్తె అక్షిత
కులం/ జననం	: మాదిగ/ 04-04-1967
విద్యాభ్యాసం:	ఎంఏ ఎల్‌ఎల్‌బీ, సోషియాలజీ
స్వగ్రామం:	జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్

నమో.. లక్ష్మీనరసింహా..

అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
కోడ్‌తో రాజకీయ ప్రభలు, డీజేల నిషేధం

నేటి నుంచి కొమ్మాల జాతర





గీసుగొండ, మార్చి 24: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమైన కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర నేటి నుంచి వైభవంగా ప్రారంభం కానుంది.ఉగాది వరకు సాగే జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం ఎన్నికల కోడ్ ఉండడంతో జాతరలో రాజకీయ ప్రభలను, డీజేలను నిషేధించారు. 50సీసీ కెమెరాలను జాతరలో ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు. భారీ పోలీస్‌బందో బస్త్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునే నిర్వహణ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం ఉదయం హోలి వేడుకల్లో మునిగి తేలి సాయంత్రం కొమ్మాల జాతరకు వాహనాలు, ఎడ్లబండ్లపై భక్తులు తరలిరావడం ఆనవాయితీగా వస్తోంది. దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట, సంగెం మండలాల భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే వరంగల్ మహానగరం నుంచి కూడా ఎడ్లబండ్లపై పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. వరంగల్ -నర్సంపేట రోడ్డులో బారులు తీరే ఎడ్లబండ్ల సవ్వడులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. నిండు పౌర్ణమి రోజు ఆలయం చుట్టూ గోవిందా నామస్మరణలతో ఎడ్ల బండ్లపై ఒంటె, గుర్రం, మేక, ఏనుగు వంటి భక్తి ప్రభలతో భక్తిపారవశ్యంతో భక్తుల చేసే కోలాహలం అంతాఇంతాకాదు. సామాజిక వేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి 55 ఫీట్ల భక్తి ప్రభను ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సోమవారం రాత్రి ప్రారంభిస్తారని ఎంపీపీ భీమగాని సౌజన్య తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు ఆలయ ఈవో శేషగిరి, వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసా చార్యులు తెలిపారు. జాతరలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కల్పిం చినా కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రవిందర్ హెచ్చరించారు.

వెలిసిన దుకాణాలు..

కొమ్మాల ఆలయ పరిసరాలు దుకాణాలతో సందడిగా మారాయి. ఇటీవల టెండర్లు పూర్తవడంతో టెండరు పొందినవారు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. అలయ గోపురాన్ని విద్యుద్దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. దీంతో ఆలయ పరిసరాలు విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్నాయి.

ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా: రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే



కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. ఆ బాధ్యత నాపై ఉంది. మా తల్లిదండ్రులు ప్రతియేడు జాతరకు వచ్చి మొక్కులు చెల్లించుకునేవారు. మా ఇంటి ఇలవేల్పు లక్ష్మీనరసింహుడే. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.60లక్షలను మంజూరు చేయించి స్నానపు గదులు, మరుగుదొడ్లను నిర్మించాం. వచ్చే జాతర వరకు ప్రధాన ఆర్చీ గేటు నుంచి ఆలయం వరకు సెంట్రల్ లైటింగ్‌తో డబుల్‌రోడ్డు, ఆలయం చుట్టూ కూడా డబుల్ రోడ్డు నిర్మాణం చేయిస్తా. ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో కాటేజీలు, మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు కృషిచేస్తా.

హోలీ.. హోలీల రంగహోలీ..

ఘనంగా కామ దహనం



వరంగల్ కల్చరల్, మార్చి 24: రంగుల కేళీ.. ఆనందాల హోలీ యువత చిందులేస్తూ జరుపుకునే రంగుల పండుగ రానేవచ్చింది. ప్రతీ ఏటా హోలీ పండుగను అత్యంత ఆనందోత్సవాలతో జరుపుకునే సంప్రదాయం ఆచారంగా

నేడే హోలీ..

వస్తోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు యువతులు, మహిళలు సైతం హోలీని సంబరంగా జరుపుకుంటారు. ప్రధానంగా బావ, బామర్దులు, వదిన, మరదళ్లు, స్నేహితులు హోలీ రంగులు పూసుకుంటారు. హోలీ పండుగను నగరంలో ప్రధానంగా వరంగల్ చౌరస్తా, జేపీఎన్‌రోడ్డు, పిన్నవారివీధి, బట్టల బజార్, ఆంధ్రబాలిక సెంటర్, రామన్నపేట, పాపయ్యపేట చమన్, స్టేషన్‌రోడ్డు, శ్రీకృష్ణ కాలనీ, కాశిబుగ్గ, శివనగర్, కరీమాబాద్, ఉర్సు, కొత్తవాడ, దేశాయిపేట, ఓసిటీ, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటారు. హోలీ వేడుకలకు వినియోగించే రంగులను ప్లాస్టిక్ పైపులను పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. రసాయన రంగులు వాడొద్దని సంప్రదాయమైన రంగులను వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. నగరంలో ప్రధానంగా హోలీ వేడుకల్లో మార్వాడీలు, గుజరాతీలు తమ ఫంక్షన్‌హాల్, పాఠశాలతో పాటు, పోతన రోడ్డులోని రాందేవ్ బాబా ధ్యాన మందిరంలో హోలీ సందర్భంగా వేడుకలు నిర్వహిస్తారు. ప్రత్యేక ఆకర్షణగా హోలీ వేడుకలు, భజనలు నిర్వహిస్తారు. కాగా, రంగుల విక్రయాలతో మార్కెట్లు కిటకిటలాడాయి.



వరంగల్ చౌరస్తాలో కామ ధహనం

కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచండి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 24: ఇంటి గ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. ప్రధాన కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ (ఐసీసీసీ) నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. సిబ్బందితో కలిసి పరిశీలించారు. సిస్టమ్ పనితీరును ఏజెన్సీ సభ్యులు కమిషనర్‌కు విశ్లేషించారు. బల్దియా పరిధిలో ఇప్పటికే 7 చోట్ల ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌కు సంబంధించిన ఏర్పాటు చేశామన్నారు. ఇంకా 3 జంక్షన్‌లలో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. గతంలో అనుసరించిన పద్ధతి ప్రస్తుత అడ్వాన్స్ పద్ధతిని వివరించారు. జంక్షన్‌కు ఒక వైపు మాత్రమే ఐసీసీసీ ప్రత్యేక యాప్ ద్వారా ట్రాఫిక్ నియంత్రించొచ్చని చెప్పారు. ఏఐసీసీ టెక్నాలజీ ద్వారా వాహనాల గుర్తింపు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘింపుపై చలనాలు విధించనున్నట్లు చెప్పారు. 66 డివిజన్‌లవ్యాప్తంగా జీఐఎస్ సిస్టమ్ ద్వారా ప్రత్యేక మ్యాప్‌ను రూపొందించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ సంజయ్ కుమార్, ఐటీ మేనేజర్ రమేష్, టెక్నీషియన్ పవన్‌లు పాల్గొన్నారు.





ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ సుమన్‌కు పురస్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: ఎస్సార్ వర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎన్.సుమన్‌కు హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 2023-24 విద్యాసంవత్సరానికి గాను అకడమీషియన్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన అసోసియేషన్ 51వ వార్షిక అవార్డుల కార్యక్రమంలో డాక్టర్ సుమన్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, విశిష్ట అతిథులు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జేబీ రావు, డీఆర్‌డీవో జనరల్ మేనేజర్ రాజాబాబు హాజరయ్యారు. కాగా, అసోసి యేషన్ ప్రతినిధుల చేతుల మీదుగా డాక్టర్ సుమన్ పురస్కార ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ ప్రాంతంలోనే ప్రముఖ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అవార్డును అందుకున్న డాక్టర్ సుమన్‌ను ఎస్సార్ వర్సిటీ వీసీ దీపక్, రిజిస్ట్రార్ అర్చనరెడ్డి, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.



పురస్కార ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న డాక్టర్ సుమన్











25 కోడెలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

వరంగల్ క్రైం, మార్చి 24: అనుమానాస్పదంగా డీసీఎంలో తరలిస్తున్న 25 కోడెలను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం కోదాడ నుంచి పెద్దపల్లికి డీసీఎంలో 25 కోడెలను నలుగురు వ్యక్తులు తరలిస్తుండగా ఓఆర్ఆర్‌పై పోలీసులు పట్టుకున్నారు. ఏడు మాత్రమే డీసీఎంలో తరలించాల్సి ఉండగా, 25 కోడెలను తరలిస్తుండటంతో అనుమానం వచ్చి పట్టుకున్నారు.


తరలిస్తున్న నలుగురు వ్యక్తులనుంచి సరైన సమాధానం రాకపోవడంతో కోడెలను ముప్పారంలోని బృందావన్ గోశాలకు తరలించారు. నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని కేయూ ఎస్ఐ దేవేందర్ ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.











యాసంగి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

- ఏప్రిల్ మూడోవారం నుంచి కొనుగోళ్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1078 కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం దిగుబడి 14.13 లక్షల మెట్రిక్ టన్నులు
- అందుబాటులో చాలినన్ని గన్నీ బ్యాగులు
- కమీషన్ చెల్లింపులో జాప్యం.. 22 కోట్ల బకాయిలు

హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)ఉమ్మడి వరంగల్ జిల్లాలో యాసంగి (రబీ) సీజన్ ధాన్యం కొనుగోళ్లకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ మూడో వారం నుంచి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కానున్నాయి. ఈ సీజన్ 9.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందు కోసం 1078 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఉమ్మడి జిల్లాలో ఈ సారి యాసంగిలో 9,18,337.59 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 14,13,454 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లకు అధికారులు పూనుకుంటున్నారు.

మొదలుకానున్న కోతలు

ఉమ్మడి జిల్లాలో మరో 15 రోజుల్లో యాసంగి వరి కోతలు ప్రారంభం కానున్నాయి. గతేడాది సెప్టెంబరులో పంటలు వేసిన రైతులు వరికోతలకు సిద్ధమవుతున్నారు. డిసెంబరు, జనవరి నెలల్లో నాట్లు వేసిన రైతులకు మరో నెల రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. జిల్లాలో వరి కోతలు ప్రారంభమైతే పెద్ద ఎత్తున మార్కెట్‌కు ధాన్యం వచ్చే అవకాశం ఉంటుంది. ఏటా రైతులు పౌరసరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయం చేస్తారు. ఇప్పటి నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై కసరత్తు చేస్తేనే వరి కోతలు వచ్చే సరికి అవి అందుబా టులోకి వస్తాయి. లేకుంటే రైతులు గతేడాదిలా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకా శం ఉంది. కాగా ఈ యాసంగిలో రైతులు పెద్ద ఎత్తున వరిని సాగు చేయగా సాగునీటి సరఫరా, భూగర్భ జలాలు అడుగ ంటిపోవడంతో పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పలు చోట్ల నీటి తడులు లేక పొలాలు నెర్రెలుబారాయి. కొందరు మధ్యలోనే పంటను వదిలేస్తున్నారు. దీనికితోడు వడగళ్లు, అకాల వర్షాల బెడద కూడా పొంచి ఉంది. ఈ నేపథ్యంలో త్వరగా కోతలు ప్రారంభించి వెంటనే ధాన్యాన్ని విక్రయించాలని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఏ ధాన్యం క్వింటాకు రూ. 2203,. కామన్ ధాన్యానికి క్వింటా రూ. 2183 మద్దతు ధరను ప్రకటించింది.

ఇతరులు కనిపించొద్దు..

రైస్ మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తులెవరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనిపించకుండా తగిన జాగ్రతలు తీసుకోవల సిందిగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ధాన్యం సేకరణ సిబ్బందికి అప్పుడే ఆదేశాలు జారీ చేశారు. అప్పులు వడ్డీ భారం దృష్ట్యా సకాలంలో సీఎంఆర్ డెలివరీ, బకాయిల రికవరీ జరిగేలా చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.


ధాన్యం సేకరణ కేంద్రం

గన్నీ బ్యాగులు..

ధాన్యం సేకరణలో గన్నీ బ్యాగుల పాత్ర కీలకం. చాలినన్ని గన్నీ బ్యాగులు లేకుంటే దాని ప్రభావం సేకరణపై పడుతుంది. ఈ దృష్ట్యా సేకరణ ప్రారంభానికి ముందే అన్ని జిల్లాల్లో గన్నీ బ్యాగులు చాలినంత మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని జిల్లాలో అప్పటికే అవసరమైనన్ని గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచారు. ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కాగానే వీటిని ఆయా కేంద్రాల ఇండెంట్‌ను బట్టి సరఫరా చేస్తారు. గత యాసంగి సీజన్ కన్నా ఈ సారి ధాన్యం దిగుబడులు పెద్దగా పెరిగే అవకాశాలు లేనందు వల్ల ప్రస్తుతం ఉన్న బ్యాగులు సరిపోతా యని అధికారులు చెబుతున్నారు.

కమిషన్ బకాయిలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పౌరసరాలశాఖ కమిషన్‌ను వెంట వెంటనే చెల్లించకపోవడంతో బకాయిలు రూ. కోట్లలో పేరుకు పోతున్నాయి. ప్రస్తుతం మూడు సీజన్ల బకాయిలు కేంద్రాలకు రావలసి ఉన్నది. సుమారు ఒక్కో జిల్లాకు రూ. 3 నుంచి రూ. 4 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. ఉ మ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 20 కోట్ల మేరకు బకాయిలు ఉన్నట్టు అంచనా. దీంతో ఐకేపీ, పీఏసీఎస్ అధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బకాయిల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై గత కొద్ది రోజులుగా ఒత్తిడి తెస్తున్నాయి. తమకు కమిషన్ బకాయలు చెల్లిస్తే తప్పా ఈ సారి కేంద్రాలను తెరవమని హెచ్చరించాయి. దీనితో ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభం కావడానికి ముందు మార్చి చివరి వారంలో బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు సమాచారం.

సౌకర్యాలు..

కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలను పౌరసరఫరాల శాఖ అధికారులు కల్పిస్తున్నారు. రైతులు అమ్మకానికి కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షాల వల్ల తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను సిద్ధం చేస్తున్నారు. ధాన్యం తూకం త్వరిత గతిన జరిగేందుకు వీలుగా చాలినన్ని తూకం యంత్రాలను, ధాన్యం తేమను కొలిచే పరికరాలను కూడా చాలినన్ని సమకూరుస్తున్నారు. వీటితో పాటు కొనుగోలు చేసిన ధాన్యా న్ని మిల్లులకు చేరవేసేందుకు అవసరమైన లారీలను కూడా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికలతో ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా ఈసారి కొత్తగా టెండర్లు పిలిచే అవకాశం లేనందు వల్ల గత లారీ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లనే ఈ సీజన్‌లో కొనసాగించనున్నట్టు తెలుస్తోంది.

జిల్లాల వారీగా ..

- వరంగల్ జిల్లాలో రబీలో ధాన్యం కొనుగోలుకు 208 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఈ సారి 1,10,70540 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగయింది. దాన్యం దిగుబడి 2,55,429.18 మె.ట ఉండవచ్చునని అంచనా వేశారు. 1.50 లక్షల మెట్రిక్ టన్నిలు మేరకు కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు.
- హనుమకొండ జిల్లాలో 150 కేంద్రాల ద్వారా 1.61 లక్షల మె.ట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో 1,18,061.06 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈ మేరకు 3,16,231.57 మె.ట . ధాన్యం దిగుబడి రావచ్చునని అంచనా.
- జనగామ జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో ధాన్యం సేకరణకు 195 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటి ద్వారా 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సీజన్‌లో 4,33,289.87 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ మేరకు 4,03,468.30 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లాలో ధాన్యం సేకరణకు ఈ సారి 192 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా 1.70 లక్షల మె.ట ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం. జిల్లాలో ఈ సారి రబీ సీజన్‌లో 128516.57 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2,52,766.60 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా వేస్తున్నారు.
- ములుగు జిల్లాలో 144 కొనుగోలు కేంద్రాల ద్వారా 85 వేల మె.ట ధాన్యం సేకరించనున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 46979.40 ఎకరాల్లో వరి సాగు చేశారు. 10477547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని అంచనా.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాల ద్వారా 1.20 లక్షల మెట ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో ఈ సారి 80,785.29 ఎకరాల్లో వరి సాగుకాగా దిగుబడి 209976 మెట కావచ్చునని భావిస్తున్నారు.

మహిళపై యువకుడి దాడి

హనుమకొండ టౌన్, మార్చి24: తెల్లవారుజామున ఓ యువకుడు ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ నానా హంగామా చేశాడు. అడ్డుకోబోయిన తల్లిపై కర్రతో దాడిచేసిన సంఘటన హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుమార్‌పల్లిలో చోటుచేసుకుంది. కాజీపేటకు చెందిన మల్యాల రమేశ్ అనే యువకుడు.. ఈ నెల 19న ఉదయం 6 గంటల ప్రాంతంలో కుమార్‌పల్లిలోని ఓ మహిళ ఇంట్లోకి చొరబడి నీ కూతురెక్కడంటూ ఇళ్లంతా గాలించాడు. ఈలోగా మహిళ పోలీసులకు ఫోన్‌చేయడానికి ప్రయత్నిస్తుండగా కర్రతో మహిళ ముఖంపై బలంగా కొట్టగా ముఖంపై గాయాలయ్యాయి. ఆ తర్వాత యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత మహిళ కె.మాధవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డబ్బులు ఇవ్వడం లేదంటూ సొంతింటికే నిప్పు

ఇంట్లో సామగ్రి దహనం


నాగారంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

నెక్కొండ, మార్చి 24: చేసిన అప్పులు తీర్చడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వలేదని కోపంతో కుమారుడు ఏకంగా ఇంటికే నిప్పుపెట్టిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం నాగారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... వ్యవసాయ కూలీలు కుమ్మరి వెంకన్న-ఐలమ్మ దంపతుల కుమారుడు మధు పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఐదేళ్ల క్రితం మధు భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ పెట్రోల్ బంక్‌లో పని చేసేవాడు. వ్యక్తిగత అవసరాలకు మధు రూ.1.50లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు తీర్చడానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను నెల రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం కుటుంబంతో మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లిలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వచ్చాడు. అక్కడి మధు తల్లిదండ్రులు కూడా వచ్చారు. అక్కడ కూడా డబ్బుల విషయంలో తల్లిదండ్రులతో గొడవ పడ్డాడు. అదే రోజు రాత్రి మధు ఒంటరిగా నాగారంలోని ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి సమీపంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ తీసి ఇల్లంత చల్లి నిప్పుపెట్టాడు. మంటలు వ్యాపించడంతో స్థానికులు వచ్చి మంటల్ని ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న బట్టలు, వంట సామగ్రి, తలుపులు, కిటికీలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో కారణంగా రూ.50వేల వరకు ఆస్తినష్టం వాటిందీ. విషయం తెలుసుకున్న ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకొని మధును అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై మధు తల్లిదండ్రులు, బంధువుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సుధాకర్‌రావు సేవలు మరువలేనివి

సంతాప సభలో పాల్గొన్న మాజీ మంత్రులు, ప్రభుత్వవిప్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

పెద్దవంగర, మార్చి 24 : పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ వైద్య ఆరోగ్యశ్రీ ట్రస్టు మాజీ చైర్మన్ డాక్టర్ నెమురుగొమ్ముల సుధాకర్ రావు (74) నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజలకు అందించిన సేవలు మరవలేనివని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, మామిడాల యశస్విని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం వడ్డెకొత్తపల్లిలో సుధాకర్‌రావు నివాసంలో ఏర్పాటు సంతాప సభలో పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సబ్బండ వర్గాల అభ్యున్నతికి, నియోజకవర్గ అభివృద్ధితో పాటు రైతుల కష్టాలు తీర్చడానికి శ్రీరాంసాగర్ కాలువద్వారా చెరువులు నింపడానికి కృషి చేశారని గుర్తు చేశారు. నిత్యం కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుండేవారని, విద్యార్థి దశలోనే తెలంగాణ ఉద్యమంలో పనిచేసి సామాన్య, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సేవ కార్యక్రమాలు, వైద్య సేవలందించారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో సుధాకర్‌రావు విగ్రహ ప్రతిష్టాపనకు కృషి చేస్తామని తెలిపారు. సంతాప సభలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ జీసీసీ గాంధీ నాయక్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎంపీపీ ఆంజయ్య, జడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, నాయకులు నవీన్, ఐలయ్య, సుధీర్, సీతారాములు, జాటోతు నెహ్రూనాయక్, హరిప్రసాద్, ముత్తినేని శ్రీనివాస్, కుమార్, కుటుంబ సభ్యులు, పలు ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సుధాకర్‌రావు చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు

ఇంటర్ స్పాట్ వాల్యూయేషన్‌లో నిబంధనలకు తూట్లు

తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం క్యాంపుల్లో అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని తెలంగాణ ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన మూల్యాంకన కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత సేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీనియారిటిని అతిక్రమించి అధికారులు డ్యూటీలు ఇస్తున్నారని, 10 నుంచి 20 యేళ్ల అనుభం ఉన్న ప్రైవేటు లెక్చరర్లకు క్యాంపుల్లో ఏఈలుగానే విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈలుగా అవకాశం ఇవ్వకుండా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. పైస్థాయి విధుల్లో పనిచేస్తున్న కొంతమంది అధ్యాపకులకు ఎన్నిలకు డ్యూటీలు పడినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి డబుల్ డ్యూటీలు చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్‌లోనే ఆర్జేడీ కార్యాలయాన్ని కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమం అనంతరం క్యాంపు అధికారి ఎ.గోపాల్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.



క్యాంపు అధికారి గోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్

కాంట్రాక్టర్ గుప్పిట్లోనే సింథటిక్ ట్రాక్

- డీఎస్ఏకు అందుబాటులోకి రాని జేఎన్ఎస్ ట్రాక్
- నిర్మాణమై రెండున్నరేళ్లయినా అప్పగింతలో జాప్యం
- కంప్లీషన్ లెటర్ ఇచ్చి ఆర్నెళ్లు
- అయినా పట్టించుకోని పీఆర్ శాఖ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి24: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో నిర్మించిన అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్ పనులు పూర్తయి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఇంకా కాంట్రాక్టర్ గుప్పిట్లోనే ఉంది. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నేటి వరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్ఏ)కు అప్పగించక పోవటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.


డీఎస్ఏకు అప్పగించని హనుమకొండ జేఎన్ఎస్ లోని అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్

ప్రతిష్ఠాత్మకంగా..

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఖేలో ఇండియా పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి, అత్యాధునిక హంగులతో సింథటిక్‌ట్రాక్‌ను మంజూరు చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వర్ధమాన అథ్లెట్లకు జాతీయ, అంతర్జాతీయస్థాయి శిక్షణతో పాటు మెరికల్లాంటి క్రీడాకారులకు వేదికగా నిలిచేందుకు సుమారు రూ.7కోట్ల నిధులతో 400 మీటర్ల, 8లైన్లతో కూడిన అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్‌ను కేటాయించింది. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల కిందట ట్రాక్ నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో ఆ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగానికి కేటాయించారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (సాట్) వీసీ, ఎం.డి. పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్‌తో ఒప్పందం కుదుర్చుకొని పీఆర్ శాఖ 2019 ఆగస్టు నెలలో ట్రాక్ నిర్మాణ పనుల కోసం టెండర్లను అహ్వానించింది. డిల్లీకి చెందిన శివనరేష్ అనే సంస్థ పనులు దక్కించుకుంది. సింథటిక్‌ట్రాక్‌తో పాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా భవనం నిర్మించాలనే ఒప్పందంతో 2020 మార్చి నెలలో పనులు ప్రారంభించింది. అయితే ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ.. కాంట్రాక్టర్ 2021 సెప్టెంబరు నెలలో ట్రాక్ పనులు పూర్తి చేశామని చెప్పినప్పటికీ సింథటిక్‌ట్రాక్ అధికారికంగా ప్రారంభానికి నోచుకోలేదు. కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ ప్రత్యేక అనుమతితో ఇదే యేడు సెప్టెంబరు నెల 15నుంచి 19వరకు జాతీయస్థాయి ఓపెన్ టూ ఆల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు నూతనంగా నిర్మించిన అథ్లెటిక్ సింథటిక్‌ట్రాక్‌పై లాంఛనంగా కొనసాగాయి. జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు కాంట్రాక్టర్ నేతృత్వంలో జరగడం, ట్రాక్ పనులు మొదలు పెట్టిన 9నెలలు వ్యవధిలో పనులు పూర్తి చేసి ట్రాక్ అప్పగించకపోవడంతో డీఎస్ఏ అధికారులు ట్రాక్‌ను అప్పగించడానికి కంప్లీషన్ రిపోర్టు ఇవ్వాలని పీఆర్ శాఖకు లేఖ రాశారు. సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పీఆర్ చీఫ్ ఇంజనీరింగ్ విభాగం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసి కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండగా, ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా రెండేళ్ల అనంతరం సర్టిఫికెట్‌ను డీఎస్ఏకు పంపించారు. దీంతో డీఎస్ఏ అధికారులు పీఆర్ శాఖ ఇచ్చిన లేఖను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) టెక్నికల్ విభాగానికి పంపించడంతో సంబంధిత అధికారులు సింథటిక్‌ట్రాక్‌ను సందర్శించారు. అయితే ఇందులో కొన్ని లోపాలున్నాయని తేల్చారు. సింథటిక్‌ట్రాక్‌లో ఉన్న లోపాలను కాంట్రాక్టర్ ద్వారా సరిచేసి ట్రాక్‌ను అప్పగించే విధంగా చర్యలు చేపట్టాలని పీఆర్‌శాఖకు ఆరు నెలల కిందట డీఎస్ఏ అధికారులు లేఖ పంపినప్పటికీ ఇప్పటివరకు పీఆర్‌శాఖ అధికారులు కానీ, సదురు నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ స్పందించకపోవడం దురదృష్టకరమని క్రీడాభిమానులు వాపోతున్నారు.

అంతే కాకుండా ఇటీవల డీఎస్ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఎల్ఈడీ స్క్రీన్‌లు ద్వారా కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ వర్చువల్ పద్ధతిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులు సమక్షంలో ప్రారంభించారు. సాక్ష్యాత్తు కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి నిసిత్ ప్రమాణిక్ సాయ్, సాట్ స్పోర్ట్స్ అధికారుల సమక్షంలో ట్రాక్‌ను ప్రారంభించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణిని వీడకుండా ట్రాక్‌ను అప్పగించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ట్రాక్ నిర్మాణ పనులకు రూ.7కోట్లకు గాను రూ.3.50కోట్ల చెల్లింపులు మాత్రమే జరిగాయని, మిగతా డబ్బులు రావాలని కాంట్రాక్టర్ చెబుతున్నప్పటికీ.. దీనికి ట్రాక్ అప్పగించడానికి సంబంధం లేదని పలువురు అంటున్నారు. ట్రాక్ అప్పగించడానికి అభ్యంతరాలు ఉండకూడదనే పీఆర్‌శాఖ అధికారులు కంప్లీషన్ లేఖను డీఎస్ఏ అధికారులకు ఇచ్చారంటున్నారు. అయితే ట్రాక్ నిర్మాణం పూర్తయి రెండున్నరేళ్లు ఏళ్లు గడిచిన్నా ట్రాక్‌ను ఎందుకు అప్పగించడం లేదని పీఆర్‌శాఖ.. సాట్ అధికారులను వివరణ కోరారు. అయితే ట్రాక్ మధ్యలో చిన్న లోపాలున్నాయని, వాటిని సరిచేయించడంలో జాప్యం జరుగుతోందని, త్వరలోనే డీఎస్ఏకు ట్రాక్‌ను అప్పగించేలా చూస్తామని చెప్పడం కొసమెరుపు.

ఆర్నెళ్ల కిందటే కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు..

- అశోక్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమకొండ

సింథటిక్‌ట్రాక్, భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ (పీఆర్) చీఫ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు ట్రాక్‌ను తనిఖీ ఆర్నెళ్ల కిందటే డీఎస్ఏకు కంప్లీషన్ రిపోర్టు ఇచ్చారు. ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) అధికారులకు కంప్లీషన్ లెటర్‌ను పంపించారు. ట్రాక్‌ను సందర్శించి లోపాలున్నాయని గుర్తించారు. కాంట్రాక్టర్ ట్రాక్‌పై ఉన్న లోపాలను పరిష్కరించే విధంగా పీఆర్‌శాఖ చర్యలు చేపట్టి త్వరితగతిన ట్రాక్‌ను డీఎస్ఏకు అప్పగించాలని ఆర్నెళ్ల కిందటే సాట్ అధికారులు లేఖ రాసినప్పటికీ నేటివరకు పీఆర్‌శాఖ అధికారులు స్పందించడం లేదు.

నోరూరిస్తున్న హలీమ్, హరీస్

- వరంగల్ త్రినగరిలో జోరుగా అమ్మకాలు
- 200లకు పైగా విక్రయ కేంద్రాలు
- ఆసక్తిగా తింటున్న ప్రజలు

వడ్డెపల్లి, మార్చి 24: రంజాన్ మాసం హలీమ్, హరీస్‌లకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఉపవాస దీక్షలతో శుష్కించిన శరీరానికి బలవర్ధకమైన అల్పాహారంగా వీటిని తీసుకుంటారు. ఇఫ్తార్ సమయంలో ఉపవాసం పూర్తయ్యాక ముస్లింలు హలీమ్, హరీస్ తింటారు. వరంగల్ నగరంలోని మండిబజార్, హనుమకొండలోని న్యూ రాయపుర, అశోక హోటల్ ప్రాంతం, సుబేదారి, కలెక్టరేట్‌తోపాటు కాజీపేట రైల్వే జంక్షన్ ఏరియాల్లో వీటి విక్రయాలు రంజాన్ మాసంలో ప్రతీ రోజు సాయంత్రం జోరుగా సాగుతున్నాయి.

తయారీ విధానం ఇలా..

ప్రధానంగా గొర్రె, మేక మాంసంతో తయారుచేసే దాన్ని హలీమ్ అంటారు. చికెన్‌తో చేసే వంటకాన్ని హరీస్ అని పిలుస్తారు. హోటళ్ల ముందు ఇటుకలతో తయారు చేసిన బట్టీలతో నిర్మించిన బట్టీలపై కట్టెలతో మంట పెడుతూ వీటిని వండుతారు. మాస్టర్లు తొలుత మాంసాన్ని శుభ్రం చేస్తారు. ఆ తర్వాత కాజు, బాదం, కిస్మిస్, పిస్తా, మునఖా, అంజీర్ వంటి దినుసులు కలిపి నీటిలో చాలా సేపు ఉడికిస్తారు. తర్వాత నానబెట్టిన గోధుమ రవ్వ , స్వచ్ఛమైన నేతిలో పాలు, పెరుగు పోసి మరో రెండు గంటల పాటు ఉడికించి తెడ్లతో బాగా కలియబెడుతారు. మెత్తగా ఉడికిన తర్వాత సాయంత్రం వేడిగా ఉన్న హలీమ్, హరీస్‌లను సిద్ధంగా పెడతారు. వీటిని గరిటెతో తీసి కప్పుల్లోకి తీసి కొత్తిమీర, పూదీన, నిమ్మకాయ ముక్క, కీర దోస, క్యారెట్‌తో పాటు కోడి గుడ్డును సైతం అలంకరించి హలీమ్, హరీస్‌తో పాటు సూప్‌ను వడ్డిస్తారు. నగర వాసులంతా వీటిని తినడానికి ఇష్టపడుతారు.

చారిత్రక నేపథ్యం..

హలీమ్ వంటకానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాల్లో ప్రథమంగా ప్రారంభమైన హలీమ్ కాలక్రమేపి విశ్వవ్యాప్తిలోకి వచ్చిం ది. తొలుత హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో ఈ వంటకం పరిచయమైంది. ఒకప్పుడు చాలా మంది వరంగల్ నగర వాసులు హలీమ్, హరీస్ తినేందుకు హైదరాబాద్‌కు వెళ్లేవారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం వరంగల్ హలీమ్, హరీస్ బట్టీలు వెలిశాయి. తొలుత హైదరాబాద్‌కు చెందిన మాస్టర్లే వరంగల్‌కు వచ్చి హలీమ్, హరీస్ వండేవారు. క్రమేపీ వరంగల్‌కు చెందిన మాస్టర్లు సైతం ఈ వంటకాల తయారీపై పట్టు సాధించారు. వరంగల్ త్రినగరికి చెందిన వారందరికీ రుచికరమైన హలీమ్, హరీస్‌ను అందిస్తున్నారు. నోరూరించే విధంగా రుచికరమైన ఈ వంటకాలను తినడానికి నగర వాసులంతా ఎంతో మక్కువ కనబరుస్తున్నారు. ముస్లింలే కాక ఇతరులు సైతం వీటిని తినడానికి ఎంతో ఇష్టపడుతున్నారు.

దిల్‌షాద్ హోటల్‌లో తొలిసారి..

ప్రప్రథమంగా వరంగల్ నగరంలోని మండిబజార్ (దిల్‌షాద్ హోటల్)లో హలీమ్, హరీస్‌ను వండి నగర ప్రజలకు పరిచయం చేశారు. ఒకప్పుడు హనుమకొండ సుబేదారి, కాజీపేట, నయీంనగర్‌లోని ముస్లింలు మండి బజార్‌కు వచ్చి హలీమ్, హరీస్‌లను తినేవారు. ఆ తర్వాత హనుమకొండలోని కోహినూర్ హోటల్, సుబేదారిలోని మునవర్ హోటల్‌లో హలీమ్, హరీస్ వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం వరంగల్ త్రినగరిలో సుమారు 200 లకు పైగా హలీమ్, హరీస్ విక్రయ కేంద్రాలు వెలిశాయి. మెర్క్యూరి లైట్లతో విక్రయ కేంద్రాలను శోభాయమానంగా అలంకరించడంతో వినియోగదారులు ఇష్టంగా తినడానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

- అమ్మకాలు బాగున్నాయి..

- ఎంఏ లతీఫ్, సుబేదారి బడేమసీద్..



రంజాన్ మాసం కాబట్టి ఇఫ్తార్ తర్వాత ముస్లింలు ఎక్కువ గా హలీమ్, హరీస్‌ను తినడానికి రావడంతో అమ్మకాలు బాగానే ఉన్నాయి. ముస్లింలతో పాటు ఇతరులు కూడా వీటిని తినడానికి ఇష్టపడటంతో హాట్ కేకుల్లా అమ్మకాలు సాగుతున్నాయి. హలీమ్ ప్లేట్ ధర రూ. 200, హరీస్ ప్లేట్ ధర రూ. 120 పలుకుతుంది.


కొత్తూరు జెండా ప్రాంతంలో హలీమ్, హరీస్‌లను వండుతున్న మాస్టర్



హనుమకొండ కేఎల్ఎన్ రెడ్డి కాలనీ వద్ద హరీస్, హలీమ్‌లను వండుతున్న మాస్టర్లు





బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేస్తున్న సీఐ

పోలీసుల ఔదార్యం

గీసుగొండ, మార్చి 24: మొగిలిచర్ల శివారు గోపాల్‌రెడ్డి నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఉడుత శివ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి దయనీయ పరిస్థితిని చూసి గీసుగొండ పోలీసులు మానవతా దృక్పథంతో స్పందించారు. ఆదివారం సీఐ పవన్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులను అందించారు.

రంగనాయకుడికి ఎంత కష్టం!

• నిరాధారణకు గురవుతున్న రంగశాయిపేట రంగనాయకస్వామి ఆలయం • ధూప, దీప నైవేద్యాలు కరువు
• ఆలయ భూములు అన్యాక్రాంతం • ఎండోమెంట్ అధికారులు దృష్టి సారించాలంటున్న భక్తుల వినతి

కరీమాబాద్, మార్చి 24: రంగశాయిపేట ప్రాంతానికే పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టిన పురాతన ఆలయం రంగశాయిపేట శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయం. భక్తుల కొంగుబంగారంగా పేరొందిన ఆలయాన్ని పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరుకోవడం భక్తులు మండిపడుతున్నారు. నెలల తరబడి ఆలయంలో స్వామివారికి దీపం వెలిగించి, నైవేద్యం పెట్టేవారు కరువయ్యారు. ఆలయ అభివృద్ధికి పట్టిన గ్రహణం ఇంకెప్పుడు వీడుతుందోనని రంగశాయిపేట వాసులు వాపోతున్నారు.

ఆలయ మాన్యాలు మాయం?

రంగనాయస్వామి ఆలయానికి సంబంధించి గుడి మాన్యం అమ్మవారిపేట శివారులో, దామెర చెరువు, బెస్తం చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. గుడిమాన్యం (అయ్యోర్లోల్ల మాన్యంగా చెప్పుకునే గుడి మాన్యం) భూముల కూడా కొందరు స్థానికులు తమ స్వార్థానికి ఉపయోగించుకుని , ఇప్పుడు తమ వశం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయల విలువచేసే గుడిమాన్యం ఉన్నట్లు గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. ఆలయ నిర్మాణ పనులు కొనసాగితే భూములకు, గుడికి సంబంధించిన భూముల వివరాలు ఎక్కడ బయటపడతాయోనని కొందరు ఆలయా నిర్మాణ పనులకు అడ్డు తగులుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దేవాదాయశాఖ దీనిపై దృష్టి సారించి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురాలని భక్తులు కోరుతున్నారు.

కేవలం ధనుర్మాసంలోనే పూజలు...

ద్రేవాలయంలో కేవలం ధనుర్మాసంలో గోదారంగనాయకస్వామి కల్యాణ వేడుకలను గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. స్వామివారికి ఎంతో ప్రీతికరమైన ఈ ధనుర్మాసంలో గ్రామస్థుల భాగస్వామ్యంతో ఈ మధ్య కాలంలో ధనుర్మాస వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ మాసంలో ఆలయంలో వైష్ణవ సంప్రదాయాల ప్రకారం ఈ వేడుకలను నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆలయాన్ని పట్టించుకునేవారు ఉండరు.

ఆలయ అభివృద్ధికి కమిటీ ఏర్పాటు....

ఆలయ పునరుద్ధరణ కోసం నాలుగేళ్ల క్రితం గ్రామస్థులు రంగనాయకస్వామి దేవాలయ పునరుద్ధరణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం ట్రస్టును కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఆలయ అభివృద్ధిపై రెండు సార్లు దేవాదాయశాఖ అధికారులను సంప్రదించారు. ఆలయ సమాచారం తెలుసుకున్న దేవాదాయ శాఖ అధికారులు మూడు నెలల క్రితం ఆలయాన్ని సందర్శించి, ఆలయ నిర్మాణానికి కావాల్సిన ఎస్టిమేషన్, ప్రణాళిక వేసి త్వరలోనే పనులు చేపడుతామని పేర్కొన్నారు. కానీ ఇంతవరకు అటు వైపు కన్నెత్తి చూసిన నాథుడే లేడు. కాగా, దేవాలయాభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవాదాయశాఖ మంత్రి సహకరించాలని, దేవాదాయ శాఖ అధికారులతో ఆలయ పనులు ప్రారంభించేలా చొరవ చూపాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ఆలయ చరిత్ర వివరాలు...

రంగశాయిపేట కాపువాడలోని రంగనాయకస్వామి దేవాలయం 20 శతాబ్దాల క్రితం పల్లవరాజుల పాలనలో నిర్మించినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో రంగనాథుడు వెలిసినందుకే ఈ ప్రాంతానికి రంగశాయిపేట అనే పేరు వచ్చినట్లు తెలుస్తోంది. ఆలయంలో స్వయంభువుగా కొలువైన శ్రీ రంగనాయకస్వామి విగ్రహంలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. సాధారణంగా శ్రీమన్నారాయణుడి దశావతారాలు ఒకో చోట ఉండటం అరుదు. అందులోనూ విగ్రహంపై ఉండటం జరగదు. కానీ ఈ ఆలయంలో ఉన్నటువంటి శ్రీ రంగనాయకుడి మకర తోరణంపై దశావతారాలు ఉండటం గమనార్హం. అదే విధంగా ఆదిశేషుడి నీడలో కిరీటధారుడై శంఖ, చక్ర, గధా, అభయ హస్తంతో, ముగ్ధ మనోహర రూపంలో ఉండటం విశేషం.



శిథిలావస్థలో ఉన్న దేవాలయం, రంగనాయక స్వామి మూలవిరాట్టు విగ్రహం (ఫైల్)

ఇంతటి చరిత్ర కలిగిన ఆలయానికి ఏ గ్రహణం పట్టిందోనని భక్తులు వాపోతున్నారు.

2015 నవంబరు మాసంలో తిరుమలలో లక్ష్మీయాగం నిర్వహించడంలో భాగంగా నగరంలోని రంగశాయిపేట ప్రాంత భక్తుల నుంచి విరాళాలు సేకరించేందుకు తిరుపతి నుంచి పాంచరాత్ర ఆగమ పండితులైన త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి రంగశాయిపేటలోని రంగనాయక స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ఉన్న మూలవిరాట్టు చాలా మహిమాన్వితంగా ఉందని, ఇక్కడ ఆలయ పునరుద్ధరణతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని సూచిస్తూ ఇక్కడ ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ. లక్షరూపాయాలు విరాళంగా ప్రకటించారు. ఆయన సూచించిన ఆలయ నిర్మాణ అంశాల్లో గోదారంగనాయకస్వామి వారి ఆలయంలో పాటు, లక్ష్మీదేవి, ఆళ్వార్ల ఉప ఆలయాలు, గోశాల, యాగశాలతో సహా ఆలయం నిర్మించాలని సూచించారు. అప్పట్లో ఆయన ఆదేశానుసారం ఆలయంలో పూడికతీత పనులు చేసిన భూమి పూజకు సన్నద్ధం కాగా, స్థానికంగా ఉన్నటువంటి కొందరు వ్యక్తులు ఆలయ నిర్మాణానికి అడ్డుపడుతున్నట్లు సమాచారం.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్‌లో చేరండి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం, మార్చి 24 : గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి రాజకీయ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండ భవాని నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో సంగెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చొల్లేటి మాధవ రెడ్డి నాయకత్వంలో మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుమ్మడి హరిబాబు, అచ్చ నాగరాజు, జున్న కొమురుమల్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే మండలంలోని కుంటపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంతల ప్రతాప్ నాయకత్వంలో బీఆర్ఎస్ గ్రామ సీనియర్ నాయకులు ఎలుగోయ లింగయ్య, జున్న దేవేందర్, గోపతి మల్లయ్య, పెంతల సంపత్, ఎరుకల కుమారస్వామి, ఎరుకల శంకర్ లింగం, పెంతల మోహన్, కరుదురి కుమార స్వామి, గోనె కొమురయ్యలతోపాటు మరో 50 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జున్న యాకయ్య, పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు జున్న రమేష్, జక్క శ్రీనివాస్, కావటి రాజు, పాల్గొన్నారు.

గవిచర్ల జామా మసీద్ కమిటీ ఏర్పాటు



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సంగెం, మార్చి24: గవిచర్ల గ్రామంలోని జామా మసీద్ నూతన కమిటీని ఆదివారం ముస్లింలు సమావేశమై ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహ్మద్ షాదిక్‌పాషా, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ప్రధానకార్యదర్శిగా మహబూబ్, సలహాదారుడిగా సమీర్‌పాష, సభ్యులుగా ఫాజీల్,నిజాం, ముజ్జు రహిం పాషలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్ ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సంగెం, మార్చి 24: బొల్లికుంటలో ఇటీవల మృతిచెందిన తుమ్మ శకుంతల కుటుంబ సభ్యులకు పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతురాలి కుమారుడు బీఆర్ఎస్ నాయకుడు సాగర్‌రెడ్డితోపాటు ఆమె భర్త వెంకట్‌రెడ్డిని పరామర్శించారు.

వాడవాడల కామదహనం



పిన్నవారి వీధిలో కామ దహనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కల్పన నవీన్

వరంగల్ కల్చరల్, మార్చి 24: భౌతిక కామవాంఛలన్నీ దగ్ధం చేసి ధర్మబద్ధంగా జీవితాన్ని గడపాలనే ఉద్దేశంతో హిందూ సంప్రదాయ ప్రకారం కామదహనం కార్యక్రమాన్ని ప్రతీ ఏటా హోలీ పండుగ ముందుగా నిర్వహించుకునే ఆనవాయితీ వస్తోంది. నగరంలోని వాడవాడలా కామదహన నిర్వహణ జరిగింది. ప్రధాన కూడళ్లల్లో, డివిజన్లలో కర్రమొద్దులను వేసి కర్పూరం, పిడకలు, పసుపు కుంకుమలు చల్లి చుట్టూర నీటిని చల్లి కామదహనాన్ని వెలిగించారు. నగరంలోని పిన్నవారి వీధిలో కార్పొరేటర్ గందె కల్పన నవీన్ డప్పు చప్పుళ్ల మధ్య హోలీ వేడుకల ప్రారంభానికి ముందుగా కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలని సేవా దళ్ అధ్యక్షుడు గొడ్ల రవీంద్రనాథ్, శ్రీనాథ్, రాధేశ్యాం పాల్గొన్నారు.

ఓసిటీ, దయానందకాలనీలో..

వరంగల్ సిటీ: వరంగల్ ఓసిటీలో, అదే విధంగా దయానందకాలనీలో హోళీ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కామదహన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కామ దహనం సందర్భంగా ప్రజలు ఉదకము, ఎండుకొబ్బరి, రాగి నాణెం అగ్ని హోత్రునికి సమర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, ఓసిటీ అభివృద్ధి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు సొల్లేటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.హోలీ వేడుకలను ప్రజలందరు సంతోషంగా సంబురాలు చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఓసిటీ, దయానందకాలనీవాసులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో కుడా చైర్మన్ ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న ఇనగాల వెంకట్రాంరెడ్డి

వరంగల్ కల్చరల్, మార్చి 24: చారిత్రక శ్రీభద్రకాళి అమ్మవారిని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైర్మన్‌గా నియమితులైన అనంతరం మొదటిసారిగా ఆదివారం అమ్మవారికి పూజలు చేవారు. యోగా గురువు ఉమామహేశ్వర్ సబిత దంపతులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ధ్యాన యోగ గురువుగా అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఉమామహేశ్వర్ అమ్మవారిని దర్శించుకున్నారు.

బంగారు శివలింగానికి ప్రత్యేక పూజలు



శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

వరంగల్ సిటీ, మార్చి 24: భువనగిరి సమీపంలోని నాగిరెడ్డిపల్లిలో బంగారు శివలింగానికి కాశిబుగ్గకు చెందిన శ్రీసీతారామ టూర్ పరపతి సంఘ సభ్యులు ఆదివారం ప్రత్యేక పూజలుచేశారు. ఒకరోజు విహారయాత్రలో భాగంగా ఆదివారం నాగిరెడ్డిపల్లికి చేరుకుని పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీరంగనాథస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, సంఘం గౌరవ అధ్యక్షుడు వంగరి జయప్రకాష్, కోశాధికారి వంగరి రాంప్రసాద్, సభ్యులు మండల సురేష్, బంగారి భాస్కర్, ఆడెపు సాగర్, చిమ్మని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి ఆవిర్భావ వేడుకలు

వరంగల్ కల్చరల్, మార్చి 24: పాల్గుణ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. ఈ పౌర్ణమి రోజునే లక్ష్మీదేవి క్షీరసాగరం నుంచి ఆవిర్భవించిందని భావిస్తూ, లక్ష్మీదేవికి క్షీరాభిషేకాలు, అలంకరణలు, అర్చనలు నిర్వహిస్తారు. ఈమేరకు సోమవారం ప్రత్యేక పూజలు చేయనున్నారు. శ్రీధర్మశాస్త్రగా అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర ఆవిర్భావ దినోత్సవ పూజా కార్యక్రమాలను అయ్యప్ప దేవాలయాల్లో నిర్వహించనున్నారు. భద్రకాళి దేవాలయ రోడ్డులోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో బ్రహ్మశ్రీ బాలసుబ్రహ్మణ్యశర్మచే విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించబడును. నగరంలోని ప్రముఖ అయ్యప్ప గురుస్వామి పోల ఉమామహేశ్వర్ ఆధ్వర్యంలో, గిర్మాజీపేటలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాల అభిషేకం, పుష్పాభిషేకం, మహా అలంకరణ, హారతులు ఇవ్వనున్నారు.

లోక్‌సభ స్థానాలను మాదిగలకు కేటాయిస్తే బీజేపీని ఓడిస్తాం

వడ్డెపల్లి, మార్చి 2 : లోక్‌సభ ఎస్సీ స్థానాలను మాదిగలకు కేటాయిస్తే బీజేపీని ఓడిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రాంమూర్తి అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జాతీయ ప్రధాన కార్యదర్శి పసుల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో మూడు లోక్‌సభ ఎస్సీ రిజర్వేషన్ స్థానాలను బీజేపీ మాదిగలకు ఇవ్వడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు మద్దతు తెలిపిన ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణ మాదిగ, ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు బహుజన ద్రోహులని మండిపడ్డారు. ప్యాకేజీ ప్రవీణ్‌కుమార్‌ను నాగర్ కర్నూల్‌లో చిత్తుగా ఓడించాలని బహుజన ఓటర్లకు పసుల రాంమూర్తి పిలుపు నిచ్చారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24: అమెరికాలోని ఫ్లోరిడాలోని జ్యోతిష్య యోగ శాస్త్ర యూనివర్సిటీ వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషన్ స్కూల్ డైరెక్టర్ నడిపెల్లి వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ అందజేసింది. ఇటీవల అమెరికాలో యూనివర్సిటీ చాన్సిలర్ ప్రొఫెసర్ ఎన్‌వీఆర్‌పి రాజు అధ్యక్షతన డాక్టరేట్‌ను అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ, పాలమూరు యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైకాలజీతో విస్తృత ఉపాధి అవకాశాలు

కేయూ క్యాంపస్, మార్చి 24: సైకాలజీతో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం డైరెక్టర్, సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. ఆదివారం ఎస్డీఎల్‌సీఈ 2021-23 ఏడాది సైకాలజీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల తరగతుల ముగింపు సందర్భంగా విద్యార్థులతో ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

'అరూరి'కే ఖరారు

5వ పేజీ తరువాయి

పోషించారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రెండోసారి 2018లో కూడా భారీ మెజారిటీతో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా అరూరి రమేష్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. అయితే 2023 ఎన్నికల్లో అరూరి రమేష్ ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వరంగల్ టికెట్ ఆశించిన అరూరికి అధిష్టానం నిరాశ మిగిలించింది. దీనికి తోడు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అరూరి గమనించారు. ఈ క్రమంలో బీజేపీ నుంచి ఆఫర్ రాగానే పార్టీ మారారు. బీజేపీ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు.

'వందేభారత్' అదుర్స్

పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ
వరంగల్ మీదుగా రైళ్ల రాకపోకలు
ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లోనే టికెట్‌ల బుకింగ్..



గిర్మాజిపేట, మార్చి 24: అధునాతన సదుపాయాలు, వేగంతో సికింద్రాబాద్- విశాఖపట్టణాల మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరంగల్ ప్రజలకు అందుబాటులోకి రావడం ప్రయాణికులు రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉండడం, అధునాతన వసతులు ఉండడంతో ప్రయాణానికి ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. రద్దీ పెరుగుతున్న దృశ్యా ఎక్స్‌ప్రెస్‌కు టికెట్ దొరకాలంటే వెయిట్ చేయాల్సి వస్తోంది. సూపర్‌ఫాస్ట్ రైళ్లతో పోలిస్తే వందే భారత్ రైలు చార్జీలు ఎక్కువ ఉన్నా, ఆమేరకు సదుపాయాలు కూడా రైల్వే కల్పిస్తోంది. కాగా, వందేభారత్ రైల్లో ప్రయాణం చేయాలంటే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

సౌకర్యాలు ఎన్నో..

విలాసవంతమైన 180 డిగ్రీల కోణంలో తిరిగే విలాసవంతమైన సీట్లు, భోజనం, టిఫిన్ చేసేందుకు ముందున్న సీటు వెనుకభాగంలోని ఫోల్డబుల్ టేబుల్, సీటు కింది భాగంలో చార్జిబుల్ పాయింట్లు, అధునాతన టాయిలెట్లు, వాష్‌బేసిన్‌లు, పెద్ద పెద్ద అద్దాల కిటికీలు, ఆటోమేటెడ్ కోచ్ డోర్లు,పూర్తి ఏసీతో కూడిన రైలు పూర్తిగా చైర్‌కార్‌తో ఉంటుంది. ఇందులో చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ కార్ తరగతులుంటాయి. అలాగే క్యాటరింగ్ అంటే టిఫిన్, భోజనం రైల్లోనే అందిస్తారు. ఇందుకుగాను క్యాటరింగ్ చార్జి చెల్లించాల్సి ఉంటుంది. సికిందరాబాద్-విశాఖపట్టణాల మధ్య ఇపుడు రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు వరంగల్ మీదుగా నడుస్తున్నాయి.

విశాఖపట్టణం వైపునకు...

వరంగల్ నుంచి విశాఖపట్టణం వెళ్లేందుకు రెండు వందే భారత్ రైళ్లు ఉదయం, సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉన్నాయి. సికిందరాబాద్‌లో ఉదయం 5.05 గంటలకు బయలుదేరి ఉదయం 6.38 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. తిరిగి ఉదయం 6.39కి బయలుదేరి ఖమ్మంకు 7.43 గంటలు, విజయవాడకు 9.05 గంటలు, రాజమండ్రికి ఉదయం 11.00 గంటలు, సామర్లకోటకు 11.43 గంటలు, విశాఖపట్టణానికి మధ్యాహ్నం 1.50 గంటలకు చేరుకుంటుంది. వరంగల్‌లో ఉదయం 6.38 గంటలకు వందేభారత్ ఎక్కితే తక్కువ సమయంలో మధ్యాహ్నం 1.50 గంటలకు విశాఖపట్టణం చేరుకోవచ్చు. అలాగే ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి కి కూడ తక్కువ సమయంలో వెళ్లవచ్చు. మరోవందే భారత్ రైలు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.35 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. తిరిగి 4.36 గంటలకు బయలుదేరి ఖమ్మంకు సాయంత్రం 5.45 గంటలకు, విజయవాడకు రాత్రి 7 గంటలకు, రాజమండ్రికి రాత్రి 8.53 గంటలకు, సామర్లకోటకు రాత్రి 9.33 గంటలకు, విశాఖపట్టణంకు రాత్రి 11.31 గంటలకు వందే భారత్ రైలు చేరుకుంటుంది.

వరంగల్ నుంచి విశాఖపట్టణం వైపు చార్జీలు

చైర్‌కార్, ఎగ్జిక్యూటివ్ చైర్ టికెట్ ధరలు వేరువేరుగా ఉంటాయి. ఎగ్జిక్యూటివ్ చైర్ టికెట్ ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. వరంగల్ నుంచి ఖమ్మంకు ఉదయం రైలు రూ.470/ రూ.900, సాయంత్రం రైలు రూ.520/రూ.990, విజయవాడకు ఉదయం రైలు రూ.740/ రూ.1,370, సాయంత్రం రైలు రూ.685/రూ.1320లు, రాజమండ్రికి ఉదయం రైలు రూ.985లు/ సాయంత్రం రైలు రూ.1150/రూ.2045లు, సామర్లకోటకు ఉదయం రైలు రూ.1060/ రూ.2010లు, విశాఖపట్టణానికి ఉదయం రైలు రూ.1530/ రూ.2780 లుగా ఉంది.

సికిందరాబాద్‌కు చార్జీ ఇలా..

వరంగల్ నుంచి సికిందరాబాద్‌కు వందేభారత్ చైర్‌కార్ టికెట్ రూ. 725, ఎగ్జిక్యూటివ్ చైర్ టికెట్ రూ.1,235 ఉంటుంది. ఇందులో క్యాటరింగ్ చార్జి కలిపి ఉంటుంది. ఒకవేళ మనకు క్యాటరింగ్ వద్దనుకుంటే టికెట్ బుక్ చేసుకునేటప్పుడు క్యాటరింగ్ వద్దని ఆప్షన్ నమోదు చేస్తే కేవలం టికెట్ చార్జి మాత్రమే తీసుకుంటారు.

సికిందరాబాద్ వైపు...

విశాఖపట్టణంలో ఉదయం 5.45 గంటలకు బయలుదేరే వందేభారత్ (20833) మధ్యాహ్నం 12.05 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరిగి 12.06గంటలకు వరంగల్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు సికిందరాబాద్ చేరుకుంటుంది. అలాగే మరో వందే భారత్ రైలు (20708) విశాఖపట్టణంలో మధ్యాహ్నం 2.35 గంటలకు బయలుదేరి రాత్రి 9.03 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. తిరిగి రాత్రి 9.04 గంటలకు వరంగల్‌లో బయలుదేరి రాత్రి 11.20 గంటలకు సికిందరాబాద్ చేరుకుంటుంది.



వరంగల్ రూరల్

జాతరకు ముస్తాబైన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం



చెన్నారావుపేట, మార్చి 24 : మండలంలోని కోనాపురం గ్రామంలోని గుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతరకు ఆలయం సర్వాంగ సుంద రంగా ముస్తాబు చేశారు. ప్రతీ సంవత్సరం హోలీ పర్వదినం సందర్భంగా ని ర్వహించే జాతరకు విద్యుత్, తాగు నీరుతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాతరకు పూర్తి ఏర్పాట్లను నిర్వహకులు చేపట్టారు. ఈ నెల 25న సాయంత్రం జాతరలో డప్పు చప్పుళ్లతో ప్రభ బండ్ల ప్రదర్శన జరుగుతుంది. ఈ నెల 29న స్వామి వారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వ హిస్తారు. జాతరకు భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఆలయ అర్చకుడు శివకృష్ణామాచార్యులు తెలిపారు.

'పన్నుల వసూళ్లలో రాజీ పడబోము'



వర్ధన్నపేటలో ఆర్టీసీ బస్టాండ్ పన్నును వసూలు చేస్తున్న మునిసిపల్ అధికారులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 24 : పట్టణంలో ఉన్న వివిధ వాణిజ్య వ్యాపార సముదాయా లతో పాటు నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూలు చేయాల్సిన పన్నుల వసూళ్లలో రాజీ పడబోమని వర్ధన్నపేట కమిషనర్ ఇ.జోనా స్పష్టం చేశారు. ఆదివా రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌పై పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయి రూ.65 వేలను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు నోటీసులు ఇవ్వడంతో సంబంధిత శాఖ అధికారులు స్పందించి వాటిని చెల్లించినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇకపై ఎప్పటికప్పుడు పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల్లో ఆటలపై ఆసక్తిని పెంపొందించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నర్సంపేట, మార్చి 24 : పిల్లల్లో ఆటలపై ఆసక్తిని పెంపొందించాలని వన ప్రేమి కుడు గోకా రామస్వామి, విజడమ్ పాఠశాల డైరెక్టర్ జావేద్ అన్నారు. పట్టణంలో లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అబాకస్, చెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలితీయడం కోసం లీడ్‌ఫౌండేషన్ నిర్వాహకులు కాసుల రవికుమార్, శోభారాణిలు అబాకస్, చెస్ పోటీలు నిర్వహించడం అబినందనీయమన్నారు. రోజురోజుకు శారీరక శ్రమ, ఆటల పట్ల పిల్లల్లో ఆసక్తి సన్నగిల్లుతుందన్నారు. మొబైల్ ఫోనులో ఆటలు ఆడడం తగ్గించి పిల్లల్లో ఆటల పట్ల ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చెస్ పోటీల్లో గెలుపొందిన అర్బాజ్, తౌసిఫ్‌అలీ, ప్రణవ్య, అర్మాన్‌పాలకు, అబాకస్ పోటీల్లో గెలుపొందిన అశ్విత, వర్షిత, మనస్విని, దేవాన్ష, వరునిక, సాయితన్వి, సరయు, అల్వినాకుఉలల్సాం, ఆదీనా, జైనబ్, సాయి, ఆద్యలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చెస్ ప్లేయర్లు ప్రకాశ్, ప్రవీణ్, సాధినేని సుధాకర్, డాక్టర్ విశ్వనాథ్‌నాయక్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తున్న మల్లంపల్లి విద్యార్థులు

జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ఖోఖో, సాఫ్ట్‌బాల్‌లో 35 మంది ప్రతిభ



సాఫ్ట్‌బాల్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన కీర్తనను అభినందిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి(ఫైల్)

దుగ్గొండి, మార్చి 24 : చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటుతూ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణిస్తున్న విద్యార్థులు పలువురి అభినందనలు పొం దుతున్నారు. దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 తరగతి వరకు సుమారు 110 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణిస్తూ మంచి గుర్తింపు పొందారు. పాఠ శాల హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రోత్సా హంతో విద్యార్థులు ఖోఖో, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో రాణిస్తు న్నారు. 2018 నుంచి 2024 వరకు పాఠశాల నుంచి ఖోఖో, సాఫ్ట్ బాల్ క్రీడల్లో జూనియర్, సీనియర్ విభా గంలో 35 మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పాల్గొని పతకాలు పొంది పాఠశాలకు గుర్తింపు తెచ్చారు. దీంతో 2023 డిసెంబరు 2 నుంచి 6వ వరకు నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఖోఖో శిక్షణ శిబిరంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నా రు. క్రీడాకారులకు దాతల సాయంతో భోజన సదుపా యం, దుస్తువుల పంపిణీ చేశారు.

జాతీయ స్థాయిలో ముగ్గురు...

2024లో 9వ తరగతి విద్యార్థి జి.సాయితేజ కర్నాట కలో జరిగిన జాతీయస్థాయి ఖోఖోలో, 8వ తరగతి విద్యార్థి కీర్తన రాజస్థాన్‌లో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్‌లో, 10వ తరగతి విద్యార్థి కె.అభిరామ్ చత్తీస్‌ఘడ్‌లో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడలో ప్రతిభ చాటారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో 11 మంది...

2018-2019లోగుర్రం సాయికుమార్(8వ తరగతి), మాచరపు అక్షయ (8వ తరగతి), కె.అంజలి (7వ తరగతి), ఎం.అభినయ్ (7వ తరగతి), ఓ.నరేందర్



క్రీడల్లో కప్‌లు పొందిన శివాని, సాయితేజ లతో పీఈటీ



పతకాలతో విద్యార్థులు (ఫైల్)

(10 తరగతి), టి.శివ (9వ తరగతి), వి.ప్రవళిక (9వ తరగతి), కె.అభిరామ్ (7వ తరగతి) 2022-2023లో ఎ.కీర్తన (8వ తరగతి), ఎస్.దీపిక (8వ తరగతి) జ్ఞానేశ్వర్ (8వ తరగతి) రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌లో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖోలో ఐదుగురు..

2022-2023లో గొంగూర కావ్య (10 తరగతి) జి. సాయితేజ (9వ తరగతి), ఎన్.శివ (7వ తరగతి), కె.సుగంధిని (9వ తరగతి), జె. కావ్యశ్రీ (8వ తరగతి)లు రాష్ట్ర స్థాయి ఖోఖోలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో 15 మంది..

2023-2024లో ఖోఖో క్రీడలో శ్రీవర్ష, గీతిక, వర ప్రసాద్, వర్షిత్, సిద్ధు, సన్ని, సాయివినేష్, అర వింద్, సాఫ్ట్‌బాల్‌లో మేఘన, సిరి, అంజలి, వైశాలి, శిరీష. జ్ఞానేషర్, జగదీశ్వర్ జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొన్నారు.



క్రీడల్లో ధృవపత్రాలు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం భద్రమ్మ, పీఈటీ స్వప్న

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు



వీరగోని స్వప్న, పీఈటీ

పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు క్రీడలపై ఆసక్తితో పాటు ప్రత్యేక శ్రద్ధ చూపుతు న్నారు. వీరికి ఖో ఖో, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో మెళకువలు నేర్పి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహిస్తున్నాము. క్రీడల్లో పాల్గొనే విధంగా హెచ్‌ఎం భద్రమ్మ, గతంలో హెచ్ ఎంగా పని చేసిన వెంకటేశ్వర్లు, ఉపా ధ్యాయులు కృషిచేశారు. దాతలు ముందుకు వచ్చి తగు సహా యం చేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు రవాణ ఖర్చులు దాతలు అందించారు.

మతోన్మాద, అవినీతి పాలకులను ఎండగట్టాలి

నర్సంపేట, మార్చి 24 : మతోన్మాద అవినీతి పాల కుల విధానాలను ఎండగట్టాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఆదివారం డివిజన్ కమిటీ సమావేశం సిం గతి మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లు, సీట్లు అధికారం దక్కించుకోవడం కోసం హామీలు ఇచ్చి గద్దెకెక్కిన పాలకులు హామీలు విస్మరిస్తున్నాయని ఆయన అన్నా రు. బీజేపీ మోదీ ప్రభుత్వం ప్రతీ పేదవాడి అకౌంట్ లో రూ:15లక్షలు వేస్తామని, ప్రతీ సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, పండించిన పంటలకు గిట్టు బాటు ధర కల్పిస్తామన్న హామీలు నేటికి అమలుకు నోచుకోలేదని అన్నారు. ఎంసీపీఐయూ, బీఎల్ఎఫ్ పార్టీలు బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరా రు. నర్సంపేట పట్టణంలోని పేదలు నివసించే కాలనీ లు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నాయకులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, కేశెట్టి సదానందం, కలకోట్ల యాదగిరి, జన్ను రమేశ్, దామ సాంబయ్య, సురేందర్, అలీసాబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శిగా సందీప్, విజయ్‌సింగ్

నర్సంపేటటౌన్, మార్చి 24 : నర్సంపేటపట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా గూడూరు సందీప్, కార్యదర్శిగా ఠాకూర్ విజయ్‌సింగ్‌ల ను ఏకగ్రీవంగా నియమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ ఆదేశాల మేరకు బీజేపీ అధ్యక్షుడు శీలం రాంబాబు ఆధ్వ ర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడు తూ పట్టణంలో పార్టీ పటిష్టతకోసం నూతన కమిటీ కృషిచేయాలని కోరారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్య దర్శి, కార్యదర్శులుగా నియమించడానికి సహకరించిన పట్ట ణ అధ్యక్షుడు శీలం రాంబాబు, నియోజకవర్గ చేరికల కమి టీ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీన ర్ వడ్డెపెల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి ప్రతాప్, మహబూబాబాద్ పార్లమెంట్ కోకన్వీనర్ రాంచంద్ర రెడ్డిలకు గూడూరు సందీప్, ఠాకూర్ విజయ్‌సింగ్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



సందీప్



విజయ్‌సింగ్

రోజూ గంటపాటు కరెంట్‌ను ఆదా చేయాలి

నర్సంపేట, మార్చి 24 : పట్టణ ప్రజ లు ప్రతీ రోజూ ఒక గంట పాటు కరెంట్ ను ఆదా చేయాలని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గిరగాని సుదర్శన్‌గౌడ్, బెజ్జం కి ప్రభాకర్ అన్నారు. పట్టణంలో శనివా రం రాత్రి స్వచ్ఛంద సంస్థలు, అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కొద్ది సేపు కరెంట్‌ను నిలిపి కొవ్వొత్తులను వెలిగించా రు. ప్రభుత్వాలు సోలార్, పవన విద్యుత్ ప్రోత్సాహకాలను ప్రకటించి కరెంట్ ఆదా కార్యక్ర మాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కోట డెవిడ్, ఎర్ర బోయిన రాజశేఖర్, గట్టు ఆనంద్, రాము, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయదీప్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పెళ్లి ఖర్చులకు ఆర్థిక సాయం

దుగ్గొండి, మార్చి24: మండలంలోని తిమ్మంపేట గ్రామ నిరుపేద ముదిరాజ్ కుటుంబాలకు పెళ్లి ఖర్చుల నిమిత్తం ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెష నల్స్ అసోసియేషన్ (మెపా) ఆధ్వర్యంలో ఆదివారం రూ:41,116 ఆర్థికసాయం చేశారు. తిమ్మంపేటకు చెందిన మేక రమేశ్-కవితల కుమార్తె ఇందు, దివంగత భూమ భాస్కర్-స్వరూపల కుమారుడు నాగరాజులకు ఈ నెల 27న వివా హం కానుంది. ఇరుకుటుంబాలు నిరుపేదలు కావడంతో గ్రామానికి చెందిన మెపా రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి చొరవతో మెపా రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకొని పోగా, రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొట్లపెల్లి సంజీవన్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌లు స్పదించి పెళ్లి ఖర్చులకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థులకు మెపా ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర కార్యదర్శి శింగారపు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, డివిజన్ కన్వీనర్ పెండ్యాల యాదగిరి, దండు నర్సయ్య, దండు రవి, రాజు, నర్సయ్య, గిన్నె స్వామి, మేక నవీన్, గాలిబ్ సంపత్, కుమారస్వామి గ్రామ పెద్దలు సౌడారపు బాలయ్య, తోటకూరి రమేశ్‌లు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న మెపా నాయకులు

కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మధుకర్



మధుకర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న వెంకటయ్య

వర్ధన్నపేట రూరల్, మార్చి 24 : మండలంలోని కట్ర్యా ల గ్రామానికి చెందిన కొండేటి మధుకర్‌ను కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియ మిస్తూ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భ ంగా మధుకర్ మాట్లాడుతూ తనకు కాంగ్రెస్ పార్టీ మండ ల ఎస్సీ సెల్ పదవి ఇచ్చినందుకు పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, జిల్లా అధ్య క్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్ రావుల నాయకత్వా న్ని బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గబ్బెట బాబు, మల్లెపాక సమ్మయ్య, కందిక ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

'అరూరి'కే ఖరారు


(5వ పేజీ తరువాయి)

పోషించారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. రెండోసారి 2018లో కూడా భారీ మెజారిటీతో వర్ధన్నపేట నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇదే సమ యంలో వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షు డిగా అరూరి రమేష్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. అయితే 2023 ఎన్నికల్లో అరూరి రమేష్ ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి వరంగల్ టికెట్ ఆశించిన అరూరికి అధిష్ఠానం నిరాశ మిగిలింది. దీనికి తోడు స్టేషన్‌ఘన్‌పూ ర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. తన కుమార్తెకు టికెట్ ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్ని స్తున్నారని అరూరి గమనించారు. ఈ క్రమంలో బీజేపీ నుంచి ఆఫర్ రాగానే పార్టీ మారారు. బీజేపీ అభ్యర్థిగా వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగుతున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దుగ్గొండి, మార్చి 24 : మండలంలోని కేశవాపురం గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో 18వ బ్రహ్మోత్స వాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సమష్టి శ్రీవిష్ణు సహస్ర నామస్తోత్రపా రాయణము, మంగళవాద్య, వేదస్వస్తి వాచనముల ద్వారా యాగశాల, పుణ్యా హవాచనము, రుత్వి గ్వరణము, రక్షాబం ధనము, మృత్సం గ్రహణము ప్రవేశము, అంకురార్పణ వేదమంత్రోత్సవాల మధ్య నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దంపతులు కంది తిరుపతిరెడ్డి, పూలమ్మ, ఆలయ నిర్మాణ వ్యవస్థాపకులు కంది జితేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

ఎంపీడీవో సూపరింటెండెంట్ మృతి



నరసింహస్వామి (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, మార్చి 24 : వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయం లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జంగా నరసింహ స్వా మి శనివారం రాత్రి మృతి చెందా డు. ఈ నెల 22న విధులు నిర్వర్తిం చేందుకు హన్మకొండ నుంచి వర్ధన్న పేటకు ఇంటి నుంచి బయలుదేరి వస్తున్న తరుణంలో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక మ్యాక్స్‌కేర్ ఆస్పత్రికి తరలించగా, బ్రెయిన్ లో బ్లడ్ క్లాట్ అవడంతో బ్రెయిన్ డెడ్ అయిందని తెలిపా రు. దీంతో చికిత్స అందిస్తున్న తరుణంలోనే మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వర్ధన్న పేట ఎం పీపీ అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో ధనలక్ష్మి ఆదివారం ఆయన నివాసానికి చేరుకుని నరసింహస్వామి మృతదేహా నికి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి



హస్లీ (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, మార్చి 24 : ప్రమాదవశాత్తు ఇంట్లో కుర్చీ పై నుంచి పడి తలకు బలమైన గాయ మై చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలం లోని రాంధాన్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రాంధాన్‌తండాకు చెందిన గుగులోతు హస్లీ(63) ఈ నెల 23న ఇంట్లోని సెల్ఫ్‌పైన ఉన్న కందుల డబ్బాను తీసేందుకు కుర్చీ వేసుకుని ప్రయత్నిస్తుండగా కుర్చీ నుంచి ప్రమాదవశాత్తు కింద పడి పోయింది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో వర్ధ న్నపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి తీసు కెళ్లారు. ఆదివారం హస్లీ అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్సులో వరంగల్ ఎంజీ ఎం ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెంది నట్లు తెలిపారు. దీంతో మృతురాలి కుమా రుడు గుగు లోతు దేవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బూడిద లారీలు స్వాధీనం



ఇల్లందలో లారీల వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ

వర్ధన్నపేట రూరల్, మార్చి 24 : బూడిద లోడుతో రోడ్డుపై నిర్లక్ష్యంగా వెళ్తున్న లారీలను శనివారం రాత్రి వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులు గా ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తున్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హెచ్‌జీ కంపె నీకి చెందిన లారీలు రామగుండం నుంచి ఖమ్మం జిల్లాకు వెళ్తున్న బూడిద (ఫ్లైయాష్) తరలిస్తున్న లారీల కారణంగా రహదారి పూర్తిగా బూడిదమయంగా మారుతోంది. దీంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని గమనించి వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గల్లంతైన గేదెలు సురక్షితం



సురక్షితంగా గేదెలను బయటకు తీస్తున్న స్థానికులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 24 : మండలంలోని ఇల్లంద గ్రామంలో గల్లంతైన 12 గేదెలను స్థానికులు సురక్షితంగా బయటకు తీసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... స్థానిక ఎస్సారెస్పీ కెనాల్‌లో తాగు నీటి కోసం ఎస్సారెస్పీ కెనాల్‌లోకి దిగిన గేదెలు నీటి ప్రవహానికి గల్లంతయ్యాయి. వీటిని గమనించిన స్థానికులు చాకచక్యంగా నీటి ప్రవాహం నుంచి బయటకు తీసారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం



మట్టల ఆదివారం వేడుకల్లో పాల్గొన్నక్రైస్తవులు

చెన్నారావుపేట, మార్చి 24: : మండలంలోని పలు గ్రా మాల్లోని చర్చిల్లో భక్తి శ్రద్ధలతో క్రైస్తవులు మట్టల అదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా క్రైస్తవులు భక్తులు పూలతో అలంకరించిన ఈత మట లను చేతబట్టి గ్రామంలోని పుర వీధుల్లో హోయన్నకు జయము అంటూ నినాదాలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి దేవ సహదారి స్వప్న, వరంగల్ గ్రూప్ సెక్రటరీ ఆకుల అశోక్‌లు మాట్లాడుతూ భక్తులు ఎంతో పవిత్రంగా భక్తి భావంతో ఉండాలన్నారు. ఈ కార్యక్ర మంలో స్టేట్ సెక్రటరీ గోపు శ్రీనువాస్, మర్రి నవీన్, బండారి భిక్షపతి, గట్ల రవిందర్ , గట్ల హానోక్, శంకేసీ రంజిత్. గండ్లా మంజుల, ఆకుల సుభాషిని, సునిల్, అశోక్, బద్రు, జన్ను రవి, మర్రి రమేష్, ముదరుకోళ్ల సాంబయ్య, మర్రి నర్మద, హేమలత, హాసిని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నారావుపేట, మార్చి 24 : ఈ నెల 25న విద్యుత్ స రాఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ డీఈ శ్రీధర్, ఏఈ జోగానంద్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు అమీనాబాద్ విద్యుత్ సబ్ స్టేష న్‌లో మరమ్మతు పనులు చేపడుతున్నందున ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సబ్ స్టే షన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయటం జరుగుతుందని, వినియోగదారులు సహకరించా లని కోరారు.